క్లుప్తంగా

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్సై సంతోష్

శ్రీరాంపూర్/రామకృష్ణాపూర్/భీమారం: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని శ్రీరాంపూర్, రామకృష్ణాపూర్, భీమారం ఎస్సైలు సంతోష్, రాజశేఖర్, శ్వేత పేర్కొన్నారు. శ్రీరాంపూర్ బస్టాండ్ ఏరియాలో పాఠశాల విద్యార్థులకు, రామకృష్ణాపూర్‌లోని ఎస్ఆర్‌కే, భీమారం జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో ట్రాఫిక్ నిబంధనలపై శుక్రవారం అవగాహన కల్పించారు. విద్యాసంస్థలు ప్రారంభమైన దృష్ట్యా స్కూల్ బస్సులు, వ్యాన్ డ్రైవర్లు జాగ్రత్తలు పాటిస్తూ వాహనాలను డ్రైవ్ చేయాలన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్, కారు డ్రైవింగ్ చేసేవారు సీట్ బెల్ట్ ధరించాలన్నారు. మద్యం తాగి వాహనం నడిపితే కఠిన చర్యలుంటాయన్నారు. పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

శరణార్థులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న మోతే రాజలింగు

పాతమంచిర్యాల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శరణార్థులను ఆదుకోవాలని సోషలిస్టు రిపబ్లికన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మోతే రాజలింగు కోరారు. అంతర్జాతీయ శరణార్థుల దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో ఆయన మాట్లాడారు. యుద్ధాలు, ఇతర కారణాల వల్ల వారి దేశాలను వదిలి భారత్ వలసవచ్చిన వారికి సామాజిక దృక్పథంతో ఆహారం, నీరు, వైద్యం, వసతి అందించి రక్షణ కల్పించాలన్నారు. శరణార్థుల చట్టపరమైన హక్కులు కాపాడే బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. రాష్ట్ర నాయకుడు, సైకాలజిస్టు అంబాల సమ్మయ్య, జిల్లా నాయకులు కాంపెల్లి హరిచరణ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రెవెన్యూ సదస్సులు

దండేపల్లి: భూ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 3 నుంచి చేపట్టిన భూభారతి రెవెన్యూ సదస్సులు దండేపల్లి మండలంలో శుక్రవారం ముగిశాయి. చివరి రోజు కన్నెపల్లి, లింగాపూర్ గ్రామాల్లో నిర్వహించారు. మండలంలోని 31 రెవెన్యూ గ్రామాల్లో నిర్వహించిన సదస్సుల్లో 892 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ రోహిత్ దేశ్‌పాండే తెలిపారు. సదస్సుల్లో డీటీ మాధవి, ఆర్ఐ భూమన్న, సీనియర్ అసిస్టెంట్ లావణ్య పాల్గొన్నారు.

బౌలర్లదే పైచేయి

మంచిర్యాలటౌన్: ఉమ్మడి ఆదిలాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్–19 జిల్లా జట్టు ఎంపిక పోటీల్లో భాగంగా శుక్రవారం గుడిపేటలో నిర్వహించిన మ్యాచ్‌లో బౌలర్లే పైచేయి సాధించారు. 50 ఓవర్ల మ్యాచ్‌లో రెడ్, యెల్లో జట్లు తలపడగా, మొదట బ్యాటింగ్ చేసిన రెడ్ జట్టు 25.5 ఓవర్లలో 78 పరుగులకే ఆలౌట్ అయింది. యెల్లో జట్టు బౌలర్లలో ఇస్రాయిల్, రామ్‌యాదవ్‌లు తలా 3 వికెట్లు తీసి, ప్రత్యర్థి జట్టును ఆలౌట్ చేయడంలో కీలకపాత్ర పోషించారు. 79 పరుగుల విజయలక్ష్యంతో బ్యాటింగ్ చేసిన యెల్లో జట్టు 22.3 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి విజయాన్ని సాధించింది.

ఎస్బీఐ చేయూత

మంచిర్యాలటౌన్: ఎస్బీఐ స్టాఫ్ యూనియన్ హైదరాబాద్ సర్కిల్ యూనియన్ డే పురస్కరించుకుని కామ్రేడ్ వై.తారక్‌నాథ్ వర్ధంతి సందర్భంగా ఏటా జూన్ 20న చేపట్టే సేవా కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం అమృతహస్తం అనాథ, వృద్ధులు, వికలాంగుల ఆశ్రమానికి చేయూతనందించారు. ఎస్బీఐ మంచిర్యాల రీజినల్ సెక్రటరీ కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు, పిల్లలకు స్కూల్ బ్యాగ్, లంచ్ బాక్సులు పంపిణీ చేశారు. ఎస్బీఐ రీజినల్ మేనేజర్ రితేశ్ కుమార్‌గుప్తా, చీఫ్ మేనేజర్ అలోక్ వర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

వాటర్ ట్యాంక్ ఎక్కి ఆందోళన

భీమారం: భీమారం సమీపంలో గొల్లవాగు ప్రాజెక్టులో కాంట్రాక్టర్ చేపలు పట్టడం ఆపాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం భీమారం చెందిన సుంకరి గోపాల్, దాసరి చంద్రమౌళి వాటర్ ట్యాంక్ ఎక్కి ఆందోళన చేపట్టారు. ముదిరాజ్‌లకు చెందిన కొందరు ప్రాజెక్టులో చేపలు పట్టుకునేందుకు కరీంనగర్‌కు చెందిన వ్యక్తికి లీజుకు ఇచ్చారని వారు ఆరోపించారు. ఈ లీజును రద్దు చేసి ముదిరాజ్‌లకే అవకాశమివ్వాలని ఫిషరీస్ అధికారులను కోరారు. కాగా, మంచిర్యాల మత్స్యశాఖ ఏడీ అవినాష్ సాయంత్రం భీమారం చేరుకుని వాటర్ ట్యాంకెక్కి ఆందోళన చేస్తున్నవారితో మాట్లాడి శాంతింపజేశారు.

భీమారం అడవుల్లో భగీరథ నీరు

- అక్రమంగా నీటిని తరలిస్తున్న అటవీశాఖ
- పైపుల ద్వారా నేరుగా కుంటలోకి నీరు



భీమారంలో జాతీయ రహదారి పక్కనే గ్రిడ్ పైపులైన్‌కు అక్రమ కనెక్షన్



మిషన్ భగీరథ నీటితో కుంటలోకి నింపుతున్న నీరు

భీమారం: మంచిర్యాల–చెన్నూరు జాతీయ రహదారి పక్కనే భీమారం అడవుల్లోకి అటవీశాఖ అధికారులు అక్రమంగా మిషన్ భగీరథ నీరు తరలిస్తున్నారు. అక్కడ కుంట నిర్మించి భగీరథ నీటిని ప్లాస్టిక్ పైపులైను వేసి నీళ్లు నింపుతున్నారు. ఇంత జరుగుతున్నా భగీరథ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఓ వైపు తాగునీటి కోసం ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో అటవీ అధికారులు మంచిర్యాల గ్రిడ్ నుంచి చెన్నూరు తరలిస్తున్న ప్రధాన పైపులైను నుంచి కుంటలో నింపేందుకు ఎలా అనుమతి ఇచ్చారనే అనుమానం కలుగుతోంది.

నిబంధనలకు విరుద్ధంగా కనెక్షన్!

మంచిర్యాల–చెన్నూరు ప్రధాన పైపులైన్ నిర్మించే సమయంలో భీమారం వద్ద గల ప్రభుత్వ కలప డిపోలో తాగునీటి కోసం కనెక్షన్ ఇచ్చారు. నిబంధనలకు విరుద్ధంగా మిషన్ భగీరథ అధికారులు గ్రిడ్ పైపులైను నుంచి కలపడిపోకి ఒక కనెక్షన్ ఇచ్చినట్లు తెలిసింది. గత రెండేళ్ల నుంచి డిపోలో మంచినీటి సదుపాయం ఉంది.

జంతువుల దాహార్తికి..

కలప డిపోకి నీటి అవసరాలకు ఇచ్చిన కనెక్షన్ కాకుండా అటవీ అధికారులు గత ఆరునెలల క్రితం అడవిలో జంతువులకు దాహార్తి తీర్చే పేరుతో దాదాపు రూ.2 లక్షలతో కుంట నిర్మించారు. అందులో నీటిని నింపేందుకు బోరుబావి నిర్మించి సోలార్ సిస్టమ్ ద్వారా నింపాల్సి ఉంది. అయితే దాన్ని మరిచి భగీరథ నీరు తరలింపునకు అక్రమంగా పైపులైన్లు ఏర్పాటు చేసి 300 మీటర్ల అడవి లోపల ఉన్న కుంటలోకి వదిలారు. రెండు ఇంచుల పైపు నీళ్లు 24 గంటలు వదులుతున్నారు. ఇంత తతంగం జరుగుతున్నా మిషన్ భగీరథ అధికారులు మాత్రం ఏమాత్రం చర్యలు చేపట్టడం లేదు. భీమారం వరకు సక్రమంగా వచ్చిన నీళ్లు చెన్నూరు వైపు తక్కువ వెళ్తున్నాయనే అనుమానం కూడా వారికి రాకపోవడం విశేషం.

ప్రజల దాహార్తి తీర్చని భగీరథ

మిషన్ భగీరథ నీళ్లు గ్రామాల్లో సక్రమంగా అందడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎవరైన అక్రమార్కులు నీటిని అక్రమంగా తరలిస్తే వద్దని చెప్పే వాళ్లే ఇష్టానుసారంగా నీటిని తరలించడం ఎంతవరకు సమంజసమని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గతంలో భీమారం ఊరచెరువులోకి కొందరు నీటిని అక్రమంగా తరలించారు. ప్రజల ఫిర్యాదుతో అధికారులు అడ్డుకట్ట వేశారు. చాలావరకు భగీరథ నీరు సక్రమంగా రావడం లేదని ఆరోపించారు.

నీటిని తరలించడం సరికాదు



ప్రజలకు అందించాల్సిన స్వచ్ఛనీటిని అటవీశాఖ అక్రమంగా కుంటలోకి నింపడం సరికాదు. అవసరం మేరకు అటవీశాఖ బోరుబావులు నిర్మించి జంతువులకు నీటిని అందించాలి. అక్రమంగా తరలిస్తున్న నీటిని అధికారులు అరికట్టాలి.

– తగరం రాజ్‌కుమార్, భీమారం

నీటి సరఫరా వాస్తవమే

భీమారం సమీపంలో అటవీశాఖకు మిషన్ భగీరథ నీళ్లు సరఫరా అవుతున్న విషయం వాస్తవమే. కలప డిపోకి కనెక్షన్ పేరుతో కుంటలోకి తరలిస్తున్నారని సమాచారం ఉంది.

– ప్రవీణ్‌కుమార్, మిషన్ భగీరథ గ్రిడ్ ఏఈ

సీపీఐ జిల్లా మహాసభలు విజయవంతం చేయాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

చెన్నూర్: మంచిర్యాల జిల్లాకేంద్రంలో ఈనెల 21, 22 తేదీల్లో నిర్వహించే సీపీఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని పార్టీ చెన్నూర్ నియోజకవర్గ కార్యదర్శి మిట్టపల్లి పౌల్ పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం జిల్లా మహాసభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. మహాసభలకు ముఖ్య అతిథులుగా కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఐ జాతీయ కార్యవర్గసభ్యుడు చాడ వెంకటరెడ్డి హాజరవుతారని తెలిపారు. జిల్లాలోని నాయకులు, కార్యకర్తలు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. మండల కార్యదర్శి నెన్నల సమ్మయ్య, నాయకులు బడికెల మధునయ్య, సుంకరి చందు, సూత్రం నారాయణ, శంకర్, కృష్ణ, తిరుపతి, శ్రీనివాస్, రంజిత్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

జన్నారంలో..

జన్నారం: సీపీఐ మహాసభల పోస్టర్లను నాయకులతో కలిసి సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఖలిందర్ అలీఖాన్ ఆవిష్కరించారు. కార్యదర్శి దాసరి తిరుపతి, కన్వీనర్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మ బెల్లంపల్లి డివిజన్ చైర్మన్‌గా రౌతు సత్తయ్య



ఎన్నికైన సత్తయ్యతో అధికారులు, నాయకులు

బెల్లంపల్లిరూరల్: వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ(ఆత్మ) బెల్లంపల్లి డివిజన్ చైర్మన్‌గా కాసిపేట మండలానికి చెందిన మాజీ జెడ్పీటీసీ రౌతు సత్తయ్య ఎన్నికయ్యారు. కన్నాల రైతు వేదికలో శుక్రవారం ఆత్మ నూతన కమిటీ ఎన్నికల్లో ఆయన్ను చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బెల్లంపల్లి, కాసిపేట, తాండూర్ మండలాలకు చైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఈయన రెండేళ్ల పాటు రైతులకు సేవలందించనున్నారు. ఆత్మ కన్వీనర్‌గా ఏడీఏ రాజానరేందర్ వ్యవహరించనున్నారు. అనంతరం చైర్మన్‌ను నాయకులు, అధికారులు, కమిటీ సభ్యులు సన్మానించారు. ఈ సందర్భంగా సత్తయ్య మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉండి సాగులో నూతన సాంకేతికత అందించి ఆర్థికంగా బలోపేతం కావడానికి ప్రత్యేక కృషి చేస్తానన్నారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాంచందర్, కాంగ్రెస్ పార్టీ కాసిపేట, తాండూర్ మండలాధ్యక్షులు రత్నం ప్రదీప్, ఎం.డి ఈసా, టీపీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ నాతరి స్వామి, వ్యవసాయాధికారులు ప్రేమ్‌కుమార్, సుష్మ, ప్రభాకర్, ఉద్యానవన అధికారి అర్చన, పశువైద్యాధికారి దిలీప్, ఆత్మ బీటీఎం సంధ్యారాణి, ఏఈవోలు శ్రీనివాస్, తిరుపతి పాల్గొన్నారు.

గిరిజనుల సమగ్ర అభివృద్ధికి పీఎం జన్‌మన్

జన్నారం: మారుమూల గిరిజన ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రధానమంత్రి జనజాతి, ఆదివాసీ న్యాయ మహాఅభియాన్ (జన్‌మన్) పథకం ఎంతో ఉపయోగమని ఎంపీడీవో ఉమర్ షరీఫ్, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి బండ జీవరత్నం పేర్కొన్నారు. మండలంలోని కొలాంగూడ ఆదివాసీ గూడెంలో శుక్రవారం పీఎం జన్‌మన్ పథకంపై అవగాహన కల్పించారు. అదే విధంగా గిరిజనులకు ఆధార్, ఆయుష్మాన్ ఆరోగ్యశ్రీ, కుల ధ్రువీకరణ, రైతు కిసాన్ క్రెడిట్ కార్డు తదితర వాటికి సంబంధించిన దరఖాస్తులను స్వీకరించారు. వైద్యాధికారి ఉమాశ్రీ, ఎస్‌సీఈఆర్టీ రఘునాథం, హెచ్ఎం రమేశ్ చందర్, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల సందర్శన

జైపూర్: గంగిపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను మంచిర్యాల, నస్పూర్ మున్సిపాలిటీ అధికారుల బృందం సందర్శించింది. పైలెట్ ప్రాజెక్టు కింద తొలిదశలో ఎంపిక చేసిన గంగిపల్లిలో సుమారు 100 ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నారు. మున్సిపాలిటీల వార్డు అధికారులకు మంచిర్యాల హౌసింగ్ పీడీ బన్సీలాల్ ఆధ్వర్యంలో ఒక్కరోజు శిక్షణ ఏర్పాటు చేశారు. ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో శ్రీపతిబాపురావు, మున్సిపాలిటీల మేనేజర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు, వార్డు ఆఫీసర్లు, జైపూర్ ఏఈ హౌసింగ్ కాంక్ష, జీపీ కార్యదర్శి సత్యనారాయణ ఉన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి

బెల్లంపల్లి: మున్సిపాలిటీ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణకు వెంటనే చర్యలు తీసుకోవాలని మాదిగ హక్కుల దండోరా (ఎంహెచ్‌డీ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిలుక రాజనర్సు కోరారు. శుక్రవారం ఆర్డీవో హరికృష్ణకు, మున్సిపల్ కార్యాలయం ఉద్యోగికి వినతిపత్రం అందజేశారు. ఈనెల 18న పాఠశాలకు వెళ్లి ఇంటికి చేరుకునే క్రమంలో చిన్నారి ఆటోలో నుంచి కిందపడి ప్రాణాలు కోల్పోయాడని తెలిపారు. దీనికి బాధ్యుడైన ఆటోడ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. శివాజీ, రమేశ్, నారాయణ, దుర్గయ్య, రాజ్‌కుమార్, నవీన్, శేఖర్, సారయ్య, సంపత్ ఉన్నారు.

బెదిరించిన విలేకరిపై కేసు

జన్నారం: జన్నారం ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్‌ను డబ్బులు డిమాండ్ చేసి, విధులకు ఆటంకం కలిగించిన ఓ పత్రిక విలేకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గొల్లపెల్లి అనూష తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 16న సాయంత్రం 4.30 గంటల ప్రాంతంలో కళాశాలలో విద్యార్థులకు ప్రిన్సిపాల్ బండి రాములు ట్రైనింగ్ ఇస్తున్నపుడు మండల కేంద్రానికి చెందిన జమీర్ అనే వ్యక్తి వెళ్లాడు. తాను జర్నలిస్ట్ నని రూ.10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేయగా ప్రిన్సిపాల్ ఎందుకివ్వాలని బదులిచ్చాడు. దీంతో 'ఎలా డ్యూటీ చేస్తావో చూస్తా' అని జమీర్ బెదిరించాడు. తప్పుడు కథనాలు ప్రచురించడంతో పాటు విధులకు ఆటంకం కల్పించాడనే ప్రిన్సిపాల్ ఫిర్యాదు మేరకు జమీర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నకిలీ పత్తి విత్తనాల పట్టివేత

మందమర్రిరూరల్: మందమర్రి పోలీసుస్టేషన్ పరిధిలో ఎలాంటి పత్రాలు లేని 40 కిలోల నకిలీ పత్తి విత్తనాలను వ్యవసాయ అధికారులతో కలిసి ఎస్సై రాజశేఖర్ శుక్రవారం పట్టుకున్నారు. ఎస్సై కథనం ప్రకారం..ఊరు మందమర్రి శివారులో నకిలీ పత్తి విత్తనాలు విక్రయించడానికి సిద్ధంగా ఉన్నాయనే సమాచారంతో మినీ ట్యాంక్‌బండ్ వద్ద వ్యవసాయ అధికారులు, పోలీస్ సిబ్బంది సంయుక్తంగా తనిఖీ నిర్వహించారు. బైక్‌పై ఇద్దరు నకిలీ పత్తి విత్తనాలతో వస్తుండగా ఆపి తనిఖీ చేయగా 40 కిలోల పత్తి విత్తనాల బస్తా లభించింది. ఇద్దరు వ్యక్తులతోపాటు విత్తనాలు స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. వీటి విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని తెలిపారు. ఆ పత్తి విత్తనాలను ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఓ వ్యక్తి వద్ద కొనుగోలు చేసినట్టు వారు తెలపడంతో వ్యవసాయ అధికారి కిరణ్మయి ఫిర్యాదులతో బురుదగూడెంకు చెందిన గౌతమ్, మణితోపాటు మరొకరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చోరీ కేసులో నిందితుడికి ఏడాది జైలుశిక్ష

కాసిపేట: చోరీకేసులో నిందితుడికి ఏడాది జైలు శిక్షతో పాటు రూ.200ల జరిమానా విధిస్తూ బెల్లంపల్లి జే ఎఫ్‌సీఎం మేజిస్ట్రేట్ ముకేశ్ శుక్రవారం తీర్పునిచ్చారు. దేవాపూర్ ఎస్సై అంజనేయులు కథనం ప్రకారం.. దేవాపూర్ పోలీసుస్టేషన్ పరిధిలోని తాటిగూడకు చెందిన మేకల శశికుమార్ ఈఏడాది జనవరి 21న గోపు శంకరమ్మ ఇంట్లో 15 గ్రాముల నెక్లెస్, 5 గ్రాముల ఉంగారం, 20 గ్రాముల ముద్ద బంగారం ఎత్తుకెళ్లారు. బాధితురాలి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేయగా మనవడు అయిన మేకల శశికుమార్ ఇంటి తాళం పగులగొట్టి చోరీకి పాల్పడినట్లు నిర్ధారించి కోర్టులో హాజరుపర్చారు. ఏడుగురు సాక్షులను అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అజయ్‌కుమార్ విచారించి నేరం రుజువు చేడంతో మేజిస్ట్రేట్ ఈమేరకు తీర్పునిచ్చారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఆందోళనలు

- టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య



మాట్లాడుతున్న మామిడి సోమయ్య

శ్రీరాంపూర్: రాష్ట్రంలో జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఆందోళనలు చేపడుతామని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) అధ్యక్షుడు మామిడి సోమయ్య హెచ్చరించారు. శుక్రవారం నస్పూర్ కాలనీలోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మంచిర్యాల జిల్లా ఫెడరేషన్ తృతీయ మహాసభలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం చిత్తశుద్ధితో పోరాడే ఏకైక సంఘం తమదేనన్నారు. అన్ని జిల్లాల్లో యూనియన్ బలోపేతం అవుతుందన్నారు. ఈక్రమంలో అవగాహన లోపంతో కొందరు ఫెడరేషన్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని వాటిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా నూతన కమిటీ..

టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మిట్టపల్లి మధు, ఉపాధ్యక్షుడిగా వెంకటస్వామి, కార్యదర్శిగా గడ్డం సత్యగౌడ్, సంయుక్త కార్యదర్శులుగా నేరెళ్ల నరేశ్, నరేందర్, సుమన్, రవి, కార్యనిర్వాహక కార్యదర్శులుగా ఎంఏ ఆఫీస్, ఇప్ప సురేశ్, సందలేని నరసయ్య, సదానందం, శ్రీనివాస్, కోశాధికారిగా సబ్బని భాస్కర్, కార్యవర్గ సభ్యులుగా ఎండీ సుల్తాన్ ఎస్.మల్లేశ్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఫెడరేషన్ జాతీయ కార్యదర్శి పులి పలుకుల ఆనందం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి విజయకుమార్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు శంకర్, ఫెడరేషన్ జాతీయ కౌన్సిల్ సభ్యులు బాపురావు, యూసఫ్ పాల్గొన్నారు.

24 నుంచి పాలిసెట్ కౌన్సెలింగ్



బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల

బెల్లంపల్లి: తెలంగాణ రాష్ట్ర పాలిసెట్–25(ఎంపీసీ స్ట్రీమ్)లో అర్హత సాధించిన విద్యార్థులకు ఈనెల 24 నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో డిప్లొమా కోర్సుల్లో చేరికకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఈమేరకు తెలంగాణ టెక్నికల్ బోర్డు కౌన్సెలింగ్ షెడ్యూల్ ప్రకటించింది. పాలిసెట్‌లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు నిర్దేశించిన తేదీల్లో హాజరు కావాల్సి ఉంటుంది. మంచిర్యాల, కుమురంభీం ఉమ్మడి జిల్లాల పరిధిలోని విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహణ కోసం బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల హెల్ప్‌లైన్ సెంటర్‌లో కౌన్సెలింగ్ జరగనుంది. విద్యార్థులకు ఏర్పాట్లు చేయనున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.దేవేందర్ తెలిపారు. విద్యార్థులు సర్టిఫికెట్లను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

షెడ్యూల్ ఇలా..

పాలిటెక్నిక్ కళాశాలల్లో యాజమాన్య కోటా ఉండదు. వందశాతం కన్వీనర్ కోటా కింద సీట్ల భర్తీ జరగనుంది. తొలి, మలిదశలో నిర్వహించనున్న కౌన్సెలింగ్ విధి విధానాలు, తేదీలను టెక్నికల్‌బోర్డు ప్రకటించింది.

- 24నుంచి 28 వరకు సర్టిఫికేట్ల పరిశీలనకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్
- 26నుంచి 29 వరకు సర్టిఫికేట్ల పరిశీలన
- 26 నుంచి జూలై 1వరకు వెబ్ ఆప్షన్‌ల నమోదు
- జూలై 1న ఆప్షన్ల ఫ్రీజింగ్
- 4న సీట్ల కేటాయింపు
- 4 నుంచి 6 వరకు ఫీజు చెల్లించి, కళాశాలలో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయడం

ఫైనల్ ఫేజ్ కౌన్సెలింగ్ షెడ్యూల్ వివరాలు

- 9 నుంచి 10 వరకు సర్టిఫికేట్ల పరిశీలన కోసం ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్
- 11న సర్టిఫికేట్ల పరిశీలన
- 11 నుంచి 12 వరకు వెబ్ ఆప్షన్ల నమోదు
- 15న సీట్ల కేటాయింపు
- 15 నుంచి 17వరకు కళాశాలలో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయడం
- 15 నుంచి 17 వరకు ఓరియంటేషన్ ప్రోగ్రాం
- 18 నుంచి తరగతులు ప్రారంభం
- 21 నుంచి 24 వరకు వరకు ఇంటర్నల్ స్లైడింగ్
- 30న స్పాట్ అడ్మిషన్లు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



చెన్నూర్: వాకర్స్‌కు యోగా శిక్షణ ఇస్తున్న శిక్షకులు

చెన్నూర్: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని వాకర్స్ సొసైటీ అధ్యక్షుడు, ప్రభుత్వ ఉపాధ్యాయుడు మేకల రామస్వామి అన్నారు. 11వ అంతర్జాతీయ యోగా శతాబ్ది ఉత్సవాలు పురస్కరించుకొని స్థానిక బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో వాకర్స్ ఆధ్వర్యంలో యోగాపై శిక్షణ ఇచ్చారు. శిక్షకులు ఇప్ప రజిత, మోర్ల మధూకర్, గురుకృపా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు కారెంగుల రామయ్యలు పాల్గొన్నారు.

కోటపల్లి గురుకులంలో..

జైపూర్: మండల కేంద్రంలో గల కోటపల్లి గురుకులంలో శుక్రవారం యోగాపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వైద్యులు వెంకటేశ్వర్‌రావు వీరమల్ల, యోగ శిక్షకుడు రాబబాబు ఆధ్వర్యంలో విద్యార్థులు యోగాసనాలు, ప్రాణాయామం చేశారు. యోగా చేయడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. గురుకులం ప్రిన్సిపాల్ రమేశ్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

పనితీరుతోనే గుర్తింపు



శ్రీధర్‌ను సన్మానిస్తున్న డీజీఎం అనిల్‌కుమార్

శ్రీరాంపూర్: ఉత్తమ పనితీరుతోనే ఉద్యోగులకు గుర్తింపు లభిస్తుందని శ్రీరాంపూర్ ఏరియా డీజీఎం (పర్సనల్) ఎస్.అనిల్‌కుమార్ తెలిపారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబర్చిన జూనియర్ అసిస్టెంట్ ఎల్.శ్రీధర్‌ను శుక్రవారం జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో సన్మానించారు. అనంతరం ప్రశంసపత్రం అందించారు. పర్సనల్ మేనేజర్ రాజేశ్వర్, డీవైపీఎంలు రాజేష్, దేవేందర్‌రెడ్డి, సీనియర్ పీఓ కాంతారావు, మురళీ పాల్గొన్నారు.

కార్మికహక్కుల సాధనలో మార్గదర్శకులు కావాలి


మందమర్రిరూరల్: సింగరేణిలో కార్మిక హక్కుల సాధనలో యువ కార్మికనేతలు మార్గదర్శకులు కావాలని ఎన్టీయూసీ రాష్ట్ర యూత్ విభాగం అధ్యక్షుడు ఆరుముల్ల రాజు అన్నారు. మందమర్రి ఏరియాలోని ఐఎన్టీయూసీ ఆఫీస్‌లో ఐఎన్టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు దేవి భూమయ్యతో కలసి శుక్రవారం ఏరియా యువ నాయకుల విభాగంపై చర్చించారు. యువ కార్మిక నేతలకు కార్మిక హక్కులపై అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో యువ కార్మిక నేతలు చంద్రశేఖర్, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బొగ్గుబాయి వార్తలు

కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు

జైపూర్: ఇందారం ఐకే–1ఏ గనిపై ఐఎన్టీయూసీ ఆధ్వర్యంలో బాయిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరియా వైస్ ప్రెసిడెంట్ శంకర్‌రావు మాట్లాడారు. ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ నేతృత్వంలో సింగరేణి సీఎండీ బలరాం కలిసి కార్మికులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై చర్చించి వాటి తక్షణ పరిష్కారానికి విన్నవించినట్లు తెలిపారు. సింగరేణిలో మారుపేర్ల సమస్యలపై కూలంకశంగా చర్చించినట్లు పేర్కొన్నారు. మెడికల్ బోర్డు ద్వారా ఫిట్‌ఫర్ సేమ్ డ్యూటీగా ప్రకటించబడి రిటైర్మెంట్‌కు రెండేళ్లలోపు ఉన్న కార్మికులకు వన్‌టైమ్ సెటిల్మెంట్ కింద మరో అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

హెడ్‌పోస్టాఫీస్‌కు పక్కా భవనం నిర్మించాలి



ఉమ్మడి జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్‌కి వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలో హెడ్‌పోస్టాఫీస్‌కు పక్కా భవనం నిర్మించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ముల్కల మల్లారెడ్డి కోరారు. జిల్లా కేంద్రంలో ఉమ్మడి జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ గుంప స్వామిని శుక్రవారం హెడ్ పోస్టాఫీస్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. పార్టీ నాయకులు మున్నారాజా సిసోడియా, గోలి రాము, ఎల్.విజయ్‌కుమార్, తులా మధుసూదన్ రావు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

సీపీని కలిసిన రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు

పాతమంచిర్యాల: రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝాను శుక్రవారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మంచిర్యాల శాఖ ప్రతినిధులు కలిశారు. పోలీస్ కమిషనరేట్ పరిధిలో అత్యధిక రక్తదానాలు నిర్వహించినందుకు ఈనెల 14న ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా కమిషనరేట్‌కు గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అందించిన అవార్డును ఆయనకు అందజేశారు. జిల్లా చైర్మన్ కె.భాస్కర్‌రెడ్డి, కార్యదర్శి మహేందర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వి.మధుసూదన్‌రెడ్డి ఉన్నారు.

స్కూల్ బ్యాగులు అందజేత

దండేపల్లి: రెబ్బనపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పశ్చిమ గోదావరి జిల్లా భీమవరానికి చెందిన కవి ముళ్లపూడి కిశోర్‌కుమార్, హైదరాబాద్‌కు చెందిన కిరణ్‌కుమార్‌లు రూ.15 వేల విలువ చేసే స్కూల్ బ్యాగులను ఉచితంగా అందించారు. వీటిని ఎంఈవో చిన్నయ్య చేతుల మీదుగా శుక్రవారం పంపిణీ చేశారు. కాంప్లెక్స్ హెచ్ఎం రాజు, పాఠశాల హెచ్ఎం రాజేశ్వరరావు, ఉపాధ్యాయులు నర్సయ్య, వాణి, మీనాక్షి పాల్గొన్నారు.

నోట్‌బుక్‌లు పంపిణీ

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని సత్యసాయినగర్ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు కాలనీవాసులు బోడ రాజు నోట్‌బుక్‌లు పంపిణీ చేశారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఎండీ ఆరీఫ్, నాయకులు చింత అశోక్, శ్రీధర్, అమీర్, నరేశ్, సుధీర్ పాల్గొన్నారు.

రూ.10వేల ఆర్థికసాయం అందజేత

రామకృష్ణాపూర్: ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన స్థానిక బీజోన్ ఆర్‌కే4 గడ్డ ప్రాంతానికి చెందిన ఆటోడ్రైవర్ భీమయ్య కుటుంబానికి శుక్రవారం ఆటో యూనియన్ ఆధ్వర్యంలో రూ.10 వేల ఆర్థికసాయం అందించారు. యూనియన్ గౌరవ అధ్యక్షుడు గాండ్ల సమ్మయ్య, ఎనగంటి సంపత్, పాక అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

వికసిత భారత్ సంకల్ప్ సభ

వేమనపల్లి: మండల కేంద్రంలో బీజేపీ మండల సంరక్షణ ప్రభారి, జిల్లా ఉపాధ్యక్షుడు రాపర్తి వెంకటేశ్వర్ ఆధ్వర్యంలో శుక్రవారం వికసిత భారత్ సంకల్ప సభ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ 11 ఏళ్ల పాలన పూర్తి చేసుకుందన్నారు. అనంతరం మొక్కలు నాటారు. మండలంలోని గ్రామాలకు చెందిన నవీన్, శేఖర్, సంతోష్‌లు బీజేపీలో చేరారు. మండల అధ్యక్షుడు మధుకర్, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్ పాల్గొన్నారు.